అన్ని మతాల సారాంశం ఒక్కటే

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: అన్ని మతాల సారాంశం ఒక్కటేనని.. ప్రతి ఒక్కరూ పరమత సహనాన్ని పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి పరిధిలోని మహమ్మద్ సుభాని దర్గాలో ఆదివారం ఏర్పాటు చేసిన గ్యార్వి ఉత్సవాల్లో మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి చదర్ సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ఉపేందర్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, మేరాజ్ ఖాన్, రామకృష్ణ, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

పటాన్‌చెరు టౌన్: డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో ఉంటున్న వారి సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు నరసింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో నివాసం ఉంటున్న ప్రజలతో కలిసి అన్ని బ్లాక్‌లను తిరిగి పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రెండేళ్లుగా నివాసం ఉంటున్నా కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ప్రతీ ఫ్లాట్‌కు ఏడాదికి రూ.2,500 ఇంటి పన్ను కట్టించుకుంటున్న మున్సిపల్ అధికారులు ప్రజల కనీస అవసరాలను తీర్చడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాండు రంగారెడ్డి జిల్లా కమిటీ సభ్యురాలు నాయిని లలిత, సునీత, జార్జ్,రమణయ్య, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పథసంచాలన్ పోస్టర్ ఆవిష్కరణ

పటాన్‌చెరు: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ వందేళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో పథసంచాలన్ కార్యక్రమం పోస్టర్‌ను ఆదివారం పటాన్‌చెరు డివిజన్‌లో ఆర్‌ఎస్‌ఎస్ నగర కార్యవహా ఆకుల వెంకటేశ్వర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పటాన్‌చెరులో పథ సంచలన్ కార్యక్రమాన్ని ఈ నెల 12న ఆదివారం జేపీ కాలనీలోని విద్యాభారతి స్కూల్‌లో ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమాన్ని హిందూ బంధువులు కుటుంబ సమేతంగా వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కంకర పరిచి.. నిర్మాణం మరిచి!

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సాయినగర్‌లో సంవత్సర కాలంగా డ్రైనేజీ పనులు చేపట్టిన అధికారులు పనుల విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. నెలల తరబడి డ్రైనేజీ విషయంలో చేసిన తవ్వకాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డ్రైనేజీ పనులు పూర్తైనా రోడ్డు నిర్మాణం చేపట్టక నిర్లక్ష్యం వహించారు. ఎట్టకేలకు పది రోజుల క్రితం రోడ్డు కోసం కంకర పరిచి వదిలేశారు. ప్రస్తుతం ఈ కంకరతో ఎన్ని రోజులు గడుపుతారని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు పనులు వెంటనే పూర్తి చేసి స్థానికుల ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

నియామకం



లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీలో ఇటీవల జరిగిన ఉద్యోగ సంఘాల ఎన్నికల్లో టెక్నికల్ స్టాఫ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా అక్బర్ బైగ్ భారీ మెజార్టీతో గెలుపొందారు. గతంలో జరిగిన ఎన్నికలో ఈయన ఐదు పర్యాయాలు సెక్రటరీగా, ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శి గా వివిధ హోదాల్లో విజయం సాధించా రు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగుల పక్షాన ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఇంత కాలం తాను ప్రశ్నించే తత్వంతో ఉద్యోగుల సంక్షేమానికి పా టుడుతున్నానని అందుకే తనను వరుసగా గెలిపించారని పేర్కొన్నారు. తనకు భారీ విజయం సాధించి పెట్టిన టెక్నికల్ స్టాప్ ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ఓయూలో వెంకటస్వామి జయంతి

లాలాపేట: ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఓయూలో గడ్డం వెంకటస్వామి 96వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట నిర్వహించిన ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ కంచ ఐలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ ఓయూ అధ్యక్షులు నామా సైదులు, విజయ్ నాయక్, అరుణ్‌కుమార్, వెంకటస్వామి, కార్తీక్, హనుమంతు తదితరులు ఉన్నారు.

ఉన్నా.. లేనట్టే..!

గచ్చిబౌలి డివిజన్‌లో నిరుపయోగంగా పలు భవనాలు

- ఏళ్లుగా తాళాలు వేసి ఉంటున్న వైనం
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



గోపన్‌పల్లితండాలోని మల్టీ పర్పస్ కమ్యూనిటీ హాల్ భవనం

రాయదుర్గం: ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని గచ్చిబౌలి డివిజన్‌లో ప్రజల సౌకర్యార్థం కోట్లు వెచ్చించి నిర్మించిన పలు భవనాలు నిరుపయోగంగా మారాయి. అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోకపోవడంతో వాటి కోసం చేసిన వ్యయం బూడిదలో పోసిన పన్నీరు అవుతోంది. ఇవన్నీ అందుబాటులోకి వస్తే ప్రజలకు ఎంతో మేలు చేకూరే అవకాశం ఉన్నది. ఇప్పటికైనా ఆ దిశగా చర్యలు తీసుకోవాని స్థానికులు కోరుతున్నారు.

మోడల్ మార్కెట్‌కు ఎనిమిదేళ్లుగా తాళం..

- టీఎన్‌జీఓకాలనీలో రూ.50 లక్షలతో మోడల్ మార్కెట్ నిర్మించినా 8 ఏళ్లుగా తాళం వేసే ఉంటోంది.
- గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు ఫస్ట్ ఫ్లోర్‌ను దుకాణాల కోసం కేటాయించారు.
- ప్రహరీ లోపల పిచ్చి మొక్కలు పెరిగి కళావిహీనమైంది.
- ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇతర అవసరాలకు దీన్ని వినియోగించాలని కోరుతున్నారు.

మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్..

- 2015లో రూ.1.72 కోట్లతో మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
- 4 ఎకరాల్లో 2023 లో మళ్లీ రూ.1.70 కోట్లతో పూర్తి చేసేందుకు రెండోసారి శంకుస్థాపన చేశారు.
- మొత్తం రూ.3.95 కోట్లను వెచ్చించినా.. ఇప్పటి వరకు ఒక్క ఫంక్షన్ కూడా కాకపోవడం విడ్డూరం.
- స్టీల్‌తో వినూత్న పద్ధతిలో గ్రౌండ్‌ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌తో నిర్మాణం, కిచెన్ మూత్ర శాలలు, స్నానపు గదులు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు ఏర్పాట్లు, కొత్తగా ప్రధాన గేట్లు, గ్రీనరీ చుట్టూ ప్రహరీ వంటి నిర్మించారు. కానీ తాగునీటి సౌకర్యం కల్పించకపోవడం విడ్డూరం.

ఆరేళ్ల క్రితం స్పోర్ట్స్ కాంప్లెక్స్..

- 2012లో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.6 కోట్ల అంచనాతో ఖాజాగూడలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఏడాది పాటు నిధులు మంజూరు కాలేదు.
- చివరకు రూ.3 కోట్లు మంజూరు కాగా, ఇండోర్ స్టేడియం భవనాన్ని నిర్మించారు.
- 4 బ్యాడ్మింటన్ కోర్టులు, చెస్, క్యారమ్స్, మినీ జిమ్ ఇతర సౌకర్యాలతో కూడిన భవనాన్ని నిర్మించారు.
- నిర్మాణ సమయంలోనే భవనంపై రేకుల కప్పు వర్షం, గాలితో రేకులు కాస్తా కొట్టుకుపోయాయి.
- ఇదిలాఉండగా ఔట్‌డోర్ స్టేడియం నిర్మాణం అసలే ప్రారంభించలేదు.
- ఇండోర్ స్టేడియం భవనంలో జీహెచ్‌ఎంసీ సమావేశాలు, కరోనా వ్యాక్సినేషన్ కేంద్రాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ద్వారా ప్రజల నుంచి దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని కూడా నిర్వహించారు.
- ఇండోర్ స్టేడియంలోనైనా జీహెచ్‌ఎంసీ వేసవి క్రీడా శిబిరాలు ఏర్పాటు చేస్తారని క్రీడాకారులు ఎదరు చూసినా ఫలితం లేకుండా పోయింది.

కొన్నాళ్లు తాళం వేసి.. తర్వాత పూర్తిగా ఎత్తేశారు..

- రాయదుర్గంలో 12 ఏళ్ల క్రితం 'పుస్తక నిక్షిప్త కేంద్రం' పేరిట గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు.
- ఈ కేంద్రాన్ని 13 అక్టోబర్ 2013లో అప్పటి ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ హఫీజ్, కార్పొరేటర్ ఆవుల సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు.
- రెండేళ్లు దినపత్రికలు, ఇతర పుస్తకాలను చదివేందుకు చాలామంది ఆసక్తి చూపారు. ఆ తర్వాత దీనిని రెండేళ్లు గడిచాక పూర్తిగా మూసేశారు.
- ఆ తర్వాత డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేయాలని ఆలోచన ఉన్నా.. కార్యారూపం దాల్చలేదు. కొన్నాళ్ల పాటు తాళం వేసి ఉంచినా తర్వాత దీన్ని పూర్తిగా అక్కడి నుంచి ఎత్తేశారు.
- ఏది ఏమైనా గచ్చిబౌలి డివిజన్‌లో మోడల్ మార్కెట్, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, స్పోర్ట్ కాంప్లెక్స్, పుస్తక నిక్షిప్త కేంద్రం వంటి వాటిని ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఖాజాగూడలో జీహెచ్‌ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్ భవనం



రాయదుర్గంలోని మూసేసిన పుస్తకనిక్షిప్త కేంద్రం



టీఎన్‌జీఓకాలనీలో మోడల్ మార్కెట్ భవనం

7 రోజులు.. 416 మంది మందుబాబులు

'ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవింగ్' లో అదుపులోకి

రాయదుర్గం: సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 4 వరకు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసుల 'వీకెండ్-స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవింగ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో 416 మంది మందుబాబులను అదుపులోకి తీసుకున్నారు. వారిని కోర్టులో హాజరుపర్చామని సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు. ఇందులో 51 డీడీ కేసులను న్యాయస్థానాలు పరిష్కరించాయి. 45 మందికి జరిమానా విధించగా మరో ఆరుగురికి జైలు శిక్ష విధించారు. వారిలో ఒకరోజు శిక్షను నలుగురికి, 2 రోజుల శిక్షను ఇద్దరికి విధించారు. కాగా మరో ఐదుగురికి జరిమానాలో భాగంగా సామాజిక సేవ కేటాయించిందని పోలీసులు తెలిపారు.

మురుగు సమస్యను పరిష్కరించరూ..!



ఎంపనగర్ కాలనీలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

మియాపూర్: కాలనీ ప్రధాన రహదారిపై మురుగు ప్రవాహం, చెత్తాచెదారంతో అపరిశుభ్రత వాతావరణం నెలకొంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎంపనగర్ రోడ్డు నుంచి దీప్తీ శ్రీనగర్ కాలనీ వరకు మురుగు నీరు 10 రోజులుగా రోడ్డుపై ప్రవహిస్తుండడంతో స్థానికులు, వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు సమస్యను పరిష్కరించి చెత్తను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శనలు

మాదాపూర్: దసరా ఉత్సవాల్లో భాగంగా శిల్పారామంలో ఆదివారం బెంగుళూరికి చెందిన భరతనాట్య కళాకారులు అమృత శేషాంక్ శిష్య బృందం భరతనాట్య ప్రదర్శనతో అలరించారు. పుష్పాంజలి, శ్లోక, దుర్గకృతి, రుక్మిణీ కౌతం, శ్లోకాంజలి, వర్ణం, దేవార్ణమా, శారదా స్తుతి, రవాణాస్తోత్రం, మంగళం తదితర అంశాలను అమృత శేషాంక్, భార్గవి, కృతిక, వైష్ణవి, లిషిత, సానిక, శ్రేయ, మార్ఘూలిని, గాయత్రి, అనికా, లితిక్ష, కారుణ్య ప్రదర్శించారు. అలాగే చేనేత, హస్త కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. నగరవాసులు గృహాలంకరణ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు.





ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది వేడుకలు



జిన్నారం (పటాన్‌చెరు): ఆర్‌ఎస్‌ఎస్ శతజయంతి వేడుకలను ఆయా పట్టణాల్లో ఘనంగా నిర్వహించారు. జిన్నారం, గుమ్మడిదల, బొల్లారం, గడ్డపోతారంలో ఆదివారం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వందరోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక హిందూ జాగరణ సమితి ఆధ్వర్యంలో భారీగా పదసంచాలన్ ర్యాలీలు నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న సంఘ్ సేవకులపై పూలవర్షం కురిపించి ఘనస్వాగతం పలికారు. ముఖ్యఅతిథిగా ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కార్యవాహ రవికుమార్ హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరూ దేశంకోసం, ధర్మం కోసం అడుగు ముందుకు వేయాలని పిలుపునిచ్చారు. హిందూ సమాజాన్ని సంఘటితం చేసే ఉద్యమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో హిందూ జాగరణ సమితి అధ్యక్షుడు ఆనంద్ చారి, ప్రత్యేక ఆహ్వానితులు కరుణ సాగర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు బ్రహ్మేందర్, సంఘ్ ప్రముఖులు గంగు భాస్కర్, వినోద్ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన వైద్యులు

సాక్షి ఎఫెక్ట్..

మణికొండ: ప్రభుత్వం ద్వారా పేదలకు వైద్య సేవలు అందిస్తున్న బస్తీ దవాఖానాల్లో డాక్టర్లు లేక రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఇటీవల 'సాక్షి' దినపత్రికలో 'అందని వైద్య సేవలు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై ప్రభుత్వం స్పందించింది. గండిపేట మండల పరిధిలోని నార్సింగి, మణికొండ, బండ్లగూడల్లో డాక్టర్లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని కథనంలో వివరించింది. స్పందించిన ప్రభుత్వం ముందుగా నార్సింగి, మణికొండలకు ఇద్దరు వైద్యులను కేటాయించిందని, బండ్లగూడకు వారం రోజుల్లో వచ్చే అవకాశం ఉందని మండల వైద్యాధికారి సత్య రత్న తెలిపారు. మణికొండకు కేటాయించిన డాక్టర్ ఆఫ్రిన్‌కు వైద్య సిబ్బందితోపాటు స్థానికులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మణికొండ మున్సిపాలిటీ మహిళా అధ్యక్షురాలు బి.ఇందిర రాంరెడ్డి మాట్లాడుతూ... పేదలకు సకాలంలో వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో అన్ని బస్తీ దవాఖానల్లో రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్‌లను నియమిస్తుందన్నారు. వారి ద్వార పేదలకు సత్వర సేవలు అందుతున్నాయన్నారు. డాక్టర్ల నియామకం విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన 'సాక్షి'కి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ప్రభావతి, నరేందర్, అశ్విన్ పాల్గొన్నారు.



మణికొండలో విధుల్లో చేరిన డాక్టర్‌కు స్వాగతం పలుకుతున్న స్థానికులు

ఓయూ ఇంజినీరింగ్ విద్యార్థుల ప్రతిభ

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ బయో మెడికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభతో రాణించారు. గత నెల 14న ప్రకటించిన హాక్ ఏ బోర్డ్ హ్యాకథాన్‌కు ఓయూ బయో మెడికల్ ఇంజనీరింగ్ విభాగం నుంచి డా. కె ఈ. విద్యాసాగర్ మార్గదర్శకత్వంలో రెండు ప్రాజెక్టులను పంపారు. ఈ నెల 4న ప్రకటించిన ఫైనల్‌లో 4వ సంవత్సరం విద్యార్థులు స్క్రీనింగ్‌లో ఉత్తీర్ణత సాధించి ఫైనల్‌లో రాణించారు. ఇందులో పక్షవాత రోగులకు సాంకేతిక వ్యవస్థ ప్రాజెక్టుకు హారిక, వెంకట జైదీప్ దత్తా మొదటి బహుమతిగా రూ.10 వేల నగదు బహుమతి అందుకున్నారు. రాజశ్రీ పద్మావతి, హర్షవర్ధన్‌లు రూపొందించిన పునరావాసం కోసం ధరించగలిగే హ్యాండ్ ఎక్సోస్కెలిటన్ ప్రాజెక్టుకు ఉత్తమ అవార్డు క్రింద రూ.2500 నగదు బహుమతిని అందుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శనతో అవార్డులు అందుకున్న రెండు జట్లకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నట్లు బీఎంఈ విభాగాధిపతి డాక్టర్ డి. సుమన్ తెలియజేశారు.

ముమ్మరంగా డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు



బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

బంజారాహిల్స్: వెస్ట్‌జోన్ ట్రాఫిక్ పోలీసులు శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు 3 గంటల పాటు 9 చోట్ల డ్రంకన్ డ్రైవ్‌లు నిర్వహించారు. మోతాదుకు మించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 92 మందిని బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ట్రాఫిక్ డీసీపీ రాహుల్‌హెగ్డే, అదనపు డీసీపీ వేణుగోపాల్ రెడ్డి, వెస్ట్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్ డ్రంకన్ డ్రైవ్‌ను పరిశీలించారు. బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.సాయిప్రకాశ్‌గౌడ్, పంజగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలపై ..

నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడంతో పాటు ట్యాంపరింగ్ చేసి నడుపుతున్న వారిపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. నగర సీపీ సజ్జనార్ ఆదేశాల మేరకు ఆదివారం పంజగుట్ట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో సిబ్బందితో పాటు ప్రత్యేక బృందాలు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించారు. సరైన నంబర్ ప్లేట్ లేని వాహనదారులపై కేసులు నమోదు చేయడంతో పాటు జరిమానా విధించారు. నంబర్ ప్లేట్ తీసుకురావడంతో పాటు జరిమానా కట్టిన తర్వాతే వాహనాలు ఇస్తామని పోలీసులు తెలిపారు.

సంక్షేమ పథకాలకు ఆకర్శితులై చేరిక



పార్టీలో చేరిన వారితో రవికుమార్ యాదవ్ తదితరులు

గచ్చిబౌలి: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్శితులై పార్టీలో చేరుతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. మసీదుబండలోని పార్టీ కార్యాలయంలో కూకట్‌పల్లి, పాపిరెడ్డినగర్ డివిజన్ల నుంచి డివిజన్ కోశాధికారి విజయ్‌కుమార్, బీజేవైఎం నాయకులు వీరేశ్ యాదవ్ ఆధ్వర్యంలో రవికుమార్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు బాలుయాదవ్ సమక్షంలో ఆదివారం పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీలో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కలిప్తామన్నారు. ప్రతిఒక్కరూ కష్టపడితేనే విజయం దరి చేరుతుందని ఆ దిశగా ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు భూపాల్ రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, కవిత, పవన్, పార్టీలో చేరిన వారు ప్రేమ్, కార్తీక్, హరీశ్, శేఖర్, ప్రేమ్, శివ, భాను, వంశీ, యశ్వంత్, వినయ్, రాము, చందు, విక్కీ, సాయిప్రణవ్, నవీన్ పాల్గొన్నారు.

ఘనంగా దుర్గామాత నిమజ్జనం



గంగారం చెరువులో నిమజ్జనం చేస్తున్న యువకులు

గచ్చిబౌలి: కొండాపూర్ శ్రీరామ్‌నగర్‌లోని ఏ-బ్లాక్‌లో ఆదివారం రాత్రి దుర్గామాత నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో 18 ఏళ్లుగా ఉత్సవాలు జరపడమే కాకుండా ఏటా అన్నదానాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో మహిళా సంఘాల ప్రతినిధులు మాయాసింగ్, విజయలక్ష్మి, ఆదలక్ష్మి, చంద్రకళ, దేవిక, వరాలు, భాగ్యకుమారి, మునావతి, పద్మ, కాలనీవాసులు పాల్గొన్నారు.

చందానగర్, మియాపూర్‌లో 79 విగ్రహాల నిమజ్జనం

చందానగర్ : చందానగర్ సర్కిల్ పరిధిలోని గంగారం, కాయిదమ్మకుంట, జేపీనగర్ ట్యాంక్ వద్ద కోనేరుల్లో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజామువరకు 79 విగ్రహాలు నిమజ్జనం చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇదిలాఉంటే నిమజ్జనం సందర్భంగా జీహెచ్‌ఎంసీ అధికారులు సౌకర్యాలు సక్రమంగా కల్పించలేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



పూజల్లో మహిళా సంఘాల ప్రతినిధులు

ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేస్తాం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ మండల పరిధిలోని ప్రతి కాలనీ, బస్తీలకు చెందిన ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను నియమిస్తూ ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర నాయకులు పోతురాజు యాదన్న, నాన్నగారి రామచందర్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ వెంకటేశ్వర కాలనీ, నేతాజీనగర్, శ్రీరామనగర్ కాలనీలను కలుపుతూ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా కథలు వెంకట రమణ, ప్రధాన కార్యదర్శిగా బోటుకుల కరణ్, సంయుక్త కార్యదర్శిగా గజాభాగా నరేశ్, ఉపాధ్యక్షులుగా కిన్నింటి రాజు తదితరులు నియమించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారాన్ని చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేసేందుకు మందకృష్ణ మాదిగ ఆదేశం మేరకు కొత్త కమిటీలను నియమించామన్నారు. కమిటీ సభ్యులంతా అందరిని సమన్వయం చేసుకుంటూ బలోపేతం చేయాలని సూచించారు. నేతలు ఆవునూరి బాబురావు, చెరుకూరి మన్యం, లింగని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.